క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: 11కేవీ ఫస్ట్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండ్, పాతఅశోక్ థియేటర్, రాయల్ బిల్డింగ్ ఏరియా, చింతకుంటవాడ, పింజరిగుట్ట, బస్టాండ్ ప్రాంతాల్లో ఉదయం 07:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కడెం మండలంలో..

కడెం: మండల వ్యాప్తంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ సుమన్‌కుమార్ పిలుపునిచ్చారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొండచిలువ హతం



హతమైన కొండచిలువ

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలోని నసీరాబాద్ గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో 10 అడుగుల భారీ కొండచిలువ కనిపించింది. భయభ్రాంతులకు గురైన రైతులు కొండచిలువను గునపాలతో కొట్టి చంపారు. హతమార్చిన కొండచిలువను చూసేందుకు సమీప ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు.

పెంబిలో ప్రభుత్వ భూమి స్వాధీనం

పెంబి: మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన సర్వేనంబర్ 205లో ఉన్న 6.3 ఎకరాలు, సర్వేనంబర్‌లో 202లో ఉన్న 1.12 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. పెంబిలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో 15 రోజుల కిందట జిల్లా సర్వేయర్, ల్యాండ్ రికార్డ్ అధికారులతో సర్వే నిర్వహించారు. శుక్రవారం ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ బృందం అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రావణ్, సర్వేయర్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు నర్సయ్య, సభ్యులు స్వప్నీల్ రెడ్డి, గోవింద్, రాజలింగు, శంకర్, మోహన్ రెడ్డి, శంకర్, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

బోధన సామగ్రి అందజేత



సామగ్రి అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని బాలికల జెడ్పీహెచ్ఎస్‌కు శుక్రవారం జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.30వేల విలువైన బోధన సామగ్రి పంపిణీ చేశారు. ఫౌండేషన్ నాలుగో వార్షికోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు స్టడీమెటీరియల్, బ్యాగులు ఇతర సామగ్రి అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ తోట సుమిత్, హెచ్ఎం సంధ్యారాణి, సభ్యులు కొక్కుల ప్రదీప్, రాజగంగన్న, చింతపండు రవి, మట్టేరి రాజశేఖర్, బాశెట్టి శివ, ఐదు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణాలు బంద్

భైంసాటౌన్: వినాయక నిమజ్జనోత్సవాల నేపథ్యంలో పట్టణంలో మద్యం దుకాణాలు బంద్ పాటించాలని ఆర్డీవో కోమల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ నజీర్‌హుస్సేన్‌తో కలిసి మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా శనివారం సాయంత్రం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంచాలని సూచించారు. దాబాలు, బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి సాయం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసాటౌన్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన కదం భోజారాం పటేల్ అనే యువకుడు ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందగా విపత్తు నిర్వహణ కింద రూ.ఐదు లక్షల చెక్కు మంజూరైంది. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం వద్ద మృతుడి తల్లి అనుషాబాయికి చెక్కును ఎమ్మెల్యే రామారావు పటేల్ అందజేశారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, భీంరావు, గణేశ్, సచిన్, సాయారెడ్డి, భూమేశ్ తదితరులు ఉన్నారు.

గణపయ్యకు ఘనమైన పూజలు

- కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు
- మండపాల వద్ద కుంకుమార్చనలు, అన్నదానం



నిర్మల్‌లో హారతిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్‌లోని ప్రియదర్శినగర్ లోకమాన్య గణేశుడి మండపంలో కుంకుమార్చనలో మహిళలు



భైంసాలోని సాయినగర్‌లో కుంకుమార్చన పూజ చేస్తున్న మహిళలు



తానూరు: సంతాన ఫలపూజలో భక్తులు



కడెం : మాసాయిపేటలో కుంకుమపూజలు



ఖానాపూర్: కుంకుమార్చనలో మహిళలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లావ్యాప్తంగా గణేశుడి ప్రతిమలు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాయి. మండపాల వద్ద అన్నదానం చేశారు. నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పూజలు చేశారు. కాలనీల్లో వినాయకులతోపాటు ప్రెస్‌క్లబ్ మట్టి గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. ఈసందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆటపాటలతో సందడి చేస్తూ గణనాథులను గంగమ్మ ఒడికి చేర్చారు.

భోసిలో భక్తజన జాతర

తానూరు: మండలంలోని భోసిలో ఏర్పాటు చేసిన కర్రవినాయకుడిని దర్శించుకునేందుకు శుక్రవారం భక్తులు బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా ఆలయంలో సంతానఫల పూజ నిర్వహించగా 70 జంటలు పాల్గొన్నాయి. అర్చకులు లక్ష్మణ్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు నాగనాథ్, అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: గణేశుడి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు చేశారు. గోసంపల్లెలో శాంతియూత్ ఆధ్వర్యంలో భక్తులు వినాయకుడికి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. పలు చోట్ల అన్నదానాలు, పూజలు నిర్వహించారు.

కడెం: మండలంలోని అంబారిపేట్‌లో వినాయక మండపాల వద్ద యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు. మాసాయిపేట్‌లో మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

భైంసాటౌన్: పట్టణంలోని పురాణబజార్‌లోని శ్రీ సర్వేశ్వర విద్యామందిర్‌లో ఏర్పాటు చేసిన శుక్రవారం వినాయకుడికి 56 రకాల ఆహార పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. పాఠశాలలో అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ కునాల్ ముంద్యా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు. భైంసాలోని సాయినగర్ గణేశ్ మండలిలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

19న తైబజార్‌కు వేలం

ఖానాపూర్: పట్టణ పరిధిలోని వారసంతతో పాటు దినసరి సంతలో పన్నులు వసూలు చేసే తైబజార్‌కు ఈనెల 19న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు కమిషనర్, పురపాలక సంఘం, ఖానాపూర్ పేరిట రూ.లక్ష డీడీ తీసి ఈనెల 17వ తేదీ నాటికి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ తైబజార్ నిర్వహణ ఏడు నెలలు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు.

గేదె అపహరణ

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలోని నసీరాబాద్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున బగ్గరి మల్లేశ్ అనే రైతుకు చెందిన గేదెను గుర్తు తెలియని వ్యక్తులు వాహనంలో తీసుకెళ్లారు. గేదె విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.

వైద్య శిబిరం

ముథోల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏఎన్ఎం విజయ విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, ఆశావర్కర్ సుజాత, స్రవంతి ఉన్నారు.

పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సోన్: గోదావరి నదిలోకి వరద నీరు వదులుతున్నారని.. పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోన్ ఎస్సై కె.గోపి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చేపలు పట్టేవారు, పశువుల కాపరులు తీర ప్రాంత ప్రజలు గోదావరి నదిలోకి దిగవద్దని కోరారు.

గ్రామాల్లో ప్రశాంతంగా నిమజ్జనం



ఖానాపూర్‌లో ఆకట్టుకున్న గణేశుడి శోభాయాత్ర

తానూరు: మండలంలోని ఉమ్రి(కే), హిప్నెల్లి, ఝరి(బి), బోల్సా, బామ్నితండా, మొగ్లి గ్రామాల్లో శుక్రవారం గణేశుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. వీధుల్లో యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

కుంటాల: మండలంలోని అంబకంటి, అందాకూర్, మెదన్‌పూర్, అంబుగామ, పెంచికల్‌పాడ్, రాయపాడ్‌తండా, కుంటాల, కల్లూరు గ్రామాల్లో శుక్రవారం నిమజ్జనం నిర్వహించారు. అందాకూర్‌లో వేలంలో లడ్డూను దక్కించుకున్న బి.రవిని సన్మానించారు. ఎస్సై సీహెచ్.భాస్కరాచారి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భైంసారూరల్: మండలంలోని బిజ్జూర్, చింతల్ బోరి, బోరిగాం, సిద్దూర్, మిర్జాపూర్, కుంసర, చుచుంద్ గ్రామాల్లో శుక్రవారం వినాయకుడి నిమజ్జనం నిర్వహించారు. వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి గణేశుడిని సాగనంపారు. భైంసారూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూశారు.

కుభీర్: మండలంలోని దార్‌కుభీర్, బెల్గాం, పాంగ్రా గ్రామాల్లో గణేశుడి నిమజ్జనం నిర్వహించారు.

ఘనంగా భజరంగ్‌దళ్ శోభాయాత్ర

ఖానాపూర్: పట్టణంలోని భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. 'అఖండభారత్ సాధనే భజరంగ్ దళ్ లక్ష్యం' పేరిట ఏర్పాటు చేసిన అలంకరణ ఆకట్టుకుంది. మహారాష్ట్రకు చెందిన డోల్‌థాశతోపాటు మస్కాపూర్ గ్రామ శ్రీరామ కోలాటాల బృందం నృత్యాలు అలరించాయి. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



సుర్జాపూర్‌లో వంటగ్యాస్ సబ్సిడీ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో మహాలక్ష్మి పథకం కింద మంజూరైన వంటగ్యాస్ సబ్సిడీ పత్రాలను 50 మందికిపైగా అందజేశారు. అంతకముందు పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నిమ్మల రమేశ్ అనారోగ్యంతో బాధపడుతుండగా వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఇటీవల రిటైర్డ్ హెచ్ఎం అబ్దుల్ అజీస్, శాంతినగర్‌కు చెందిన మారుతి కూతురు మృతి చెందగా.. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అంతకముందు పట్టణంలోని పలు వినాయక మండపాల్లో పూజలు చేశారు. చిన్నం సత్యం, కావలి సంతోష్, దయానంద్, వెంకాగౌడ్, జంగిలి శంకర్, రాజునాయక్, సలీంఖాన్, షౌకత్‌పాషా, తదితరులు ఉన్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు పరిశీలన

ఖానాపూర్ శివారులో రెంకోని వాగుపై ఇటీవలి వర్షాలకు కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డును శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జు పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే వంతెన పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. అప్పటివరకు తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేయించి రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చూస్తామని పేర్కొన్నారు.

గ్రామాల్లో పర్యటన

ఖానాపూర్ మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్, ఇప్పమాడ, తుమ్మగూడెం, రంగపేట్, కుమురం భీంనగర్, ఎర్వచింతల్ తండాల్లో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పర్యటించారు. ఇటీవల పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దయానంద్, చిన్నం సత్యం, తోట సత్యం, శేషాద్రి తదితరులు ఉన్నారు.

కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకోవాలి



నర్సాపూర్(జి)లో మాట్లాడుతున్న లక్ష్మీవిశారద

లక్ష్మణచాంద: అర్హులు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి సూచించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని పార్‌పెల్లి పంచాయతీలోని పొట్టపెల్లి(బి) గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాలు కల్గిన ఆహారం అందిస్తున్నామని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పోషకాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీ సభ్యత్వ నమోదు

లక్ష్మణచాంద: మండల కేంద్రంతోపాటు కనకాపూర్, వడ్యాల్ తదితర గ్రామాల్లో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి అడ్లూరి శ్రీనివాస్, జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ కమల్ నయన్ ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు పొలాస గోవర్ధన్, సభ్యత్వ నమోదు మండల కన్వీనర్ అడ్వాల రమేశ్, మంతెన చంద్రమోహన్‌రెడ్డి, రంజిత్, సుంకు ముత్తన్న, ముత్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు

దస్తురాబాద్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని టీయూటీఎఫ్ నాయకులు తొడిశెట్టి రవికాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో టీయూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వహిద్‌ఖాన్, శ్రీనివాస్, వినోద్ రాజ్, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ గ్యాస్ పత్రాలు అందజేత

దస్తురాబాద్: మహాలక్ష్మి పథకంలో భాగంగా మండల కేంద్రంలోని రేషన్ దుకాణాల్లో శుక్రవారం వంటగ్యాస్ సిలిండర్ సబ్సిడీ పత్రాలను ఎంపీవో రమేశ్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. రేషన్‌డీలర్లు మహిళలకు ఈ పత్రాలు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, రేషన్ డీలర్ కోట శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ముథోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో శుక్రవారం సబ్సిడీపై అందించే వంటగ్యాస్ సిలిండర్‌కు సంబంధించిన బాండ్లను 300 మంది లబ్ధిదారులకు అందించారు. మాజీ సర్పంచ్ సుకన్య రమేశ్, రావుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రావుల పోశెట్టి, భూమన్న, కార్యదర్శి గంగాధర్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

లక్ష్మణచాంద: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషా దినోత్సవం

మామడ: మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, నృత్యం, క్విజ్ పోటీలు ఏర్పాటు చేసి భాషా ప్రాముఖ్యత వివరించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం

పెంబి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రమణరావు ఆధ్వర్యంలో శుక్రవారం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా రాజ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్, మహిళా ఉపాధ్యక్షులుగా చైతన్య, కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

'ఎస్సీ వర్గీకరణ కమిటీ రద్దు చేయాలి'



నిర్మల్‌లో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు ఏర్పాటు చేసిన కమిటీని సీఎం రేవంత్‌రెడ్డి రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్లు బత్తుల రంజిత్, కుంటోళ్ల వెంకటస్వామి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వర్గీకరణ కమిటీలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. ఈ కమిటీని మాల సోదరులందరూ వ్యతిరేకించాలని కోరారు. కమిటీని రద్దు చేయకుంటే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లోకి రానివ్వమని హెచ్చరించారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కోకన్వీనర్లు బొడ్డు లక్ష్మణ్, పురుషోత్తం, రత్నయ్య, గిరి, నాని భోజన్న తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: ఎస్సీ వర్గీకరణ కమిటీని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కన్వీనర్ మెట్టు ప్రసాద్, నాయకులు జడ్డి. శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ వర్గీకరణకు యత్నిస్తే ఆందోళనలకు మాలలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్



ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద అరెస్టయిన బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్: హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకుల దాడికి నిరసనగా మాజీ మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్‌లో ధర్నాకు పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్నాకు వెళ్లకుండా మండలంలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో రామునాయక్, రాజగంగన్న, కె.నారాయణరావు, పుప్పాల గజేందర్, సుమన్, ప్రదీప్, శ్రావణ్, దివాకర్, నరేందర్, మనోజ్ తదితరులు ఉన్నారు.

పెంబి: మండలంలోని బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, గంగారెడ్డి, పూర్ణచందర్‌గౌడ్, శంకర్, విలాస్, రమేశ్, రాజేందర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్(జి): కౌశిక్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు వెళ్తున్న నర్సాపూర్ (జి) మండల బీఆర్ఎస్ నాయకులను ఎస్సై హన్మాండ్లు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కుమ్మరి భాస్కర్, ఎన్.రమేశ్, కె.రమేశ్, కె.రాజాగౌడ్, జి.పోశెట్టి ఉన్నారు.

కుంటాలలో..

కుంటాల: హైదరాబాద్ వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను ఎస్సై భాస్కరాచారి ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంటవార్ దశరథ్, ఒడ్నం అనిల్‌కుమార్ అరెస్టయిన వారిలో ఉన్నారు.

కడెం: మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపుమేరకు హైదరాబాద్ వెళ్లకుండా శుక్రవారం బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్, రఫీక్, బొటు, రంజిత్, రవి, ముబారక్ అరెస్టయిన వారిలో ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్, గోపి, రాజనర్సయ్య, సుధాకర్, అనిల్, రాజు, రాములు, సురేశ్‌నాయక్, కమలాకర్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

నర్సాపూర్(జి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని మండల ప్రత్యేకాధికారి అంజిప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేందర్, డాక్టర్ విమల, ఎంపీడీఓ పుష్పలత, ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీణ, సిబ్బంది ఉన్నారు.

కాలనీల్లో పర్యటన..

నర్సాపూర్(జి): ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి అంజిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా మండల కేంద్రంలోని కాలనీల్లో పర్యటించారు. పాత టైర్లు, కుండీలు, కుండలు, డ్రమ్ముల్లో నిల్వనీటిని పారబోయాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

హెచ్ఐవీపై అవగాహన తప్పనిసరి

నిర్మల్‌ఖిల్లా: ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వక్తలు సూచించారు. జిల్లా కేంద్రంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం హెచ్ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బద్రి ప్రవీణ్ కుమార్, ఐసీటీసీ కోఆర్డినేటర్ ఎల్లేశ్, సాక్స్ కోఆర్డినేటర్ సుదర్శన్, క్షయ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, నర్సయ్య, గంగాధర్, నవీన్, శ్రీనివాస్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన బాధ్యత అందరిపై ఉందని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్ఐవీ ఎయిడ్స్, టీబీ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సంధ్యారాణి, ఎస్టీఎస్ వేణుగోపాల్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

'దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

ఖానాపూర్: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన ముసుగులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియంత పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు ప్రవర్తించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్టులకు భయపడేది లేదని.. అప్రజాస్వామికంగా వ్యవహరించేవారికి ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని అన్నారు.

పుస్తకాలు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగు, ఐదో తరగతి చదివే 10 మంది విద్యార్థులకు శుక్రవారం హెచ్ఎం సుజాత గురుకుల ప్రవేశ పరీక్ష పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.